## బీసీ సంక్షేమ రంగంలో విశిష్ట సేవలకు వెంకటలక్ష్మికి ప్రశంసా పత్రం



**చేజర్ల, పెన్ పవర్ ఆగస్టు 18:**
నెల్లూరు జిల్లాలో బీసీ సంక్షేమ శాఖకు సంబంధించి విశిష్ట సేవలు అందించిన అధికారిణి శ్రీమతి వెంకటలక్ష్మిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రశంసా పత్రంతో సత్కరించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి శ్రీ పొంగూరు నారాయణ, నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ హిమాంశు శుక్లా చేతుల మీదుగా ఆమె ఉత్తమ సేవా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర అభివృద్ధి సంక్షేమ డైరెక్టర్, బీజేపీ నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య అభినందనలు తెలిపారు. బీసీ సంక్షేమ రంగంలో ఆమె అందిస్తున్న సేవలు అభినందనీయమని, భవిష్యత్తులో మరింతగా ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

## చంద్రగిరి ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి
### - మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఎమ్మెల్యే పులివర్తి నాని వినతి



**చంద్రగిరి, పెన్ పవర్ ఆగస్టు 18:**
చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా పాకాల మండలం ఊట్లువారిపల్లి గ్రామంలోని ఆనందగిరిపై కొలువుదీరిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం విశిష్టతను ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామివారి గర్భాలయం, అర్ధమండపం, ముఖమండపం, పరివార దేవతల ఆలయ సమూహాలు, వినాయక స్వామి ఆలయం, శివాలయం, నవగ్రహ మండపం, బలిపీఠం, మెట్లు, రాజగోపురం, పోటు తదితర నిర్మాణాలను పునర్నిర్మించాల్సి ఉందని వివరించారు.ఈ పనులకు సుమారు రూ.16 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధుల మంజూరుకు సమర్పించినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. ఆలయానికి ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.ఆలయ జీర్ణోద్ధరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టేందుకు అవసరమైన నిధులను మంజూరు చేసి సహకరించాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు.

## నెల్లూరు జిల్లాలో మెగా రుణమేళా నిర్వహణకు బ్యాంకర్లకు సూచన

- బ్యాంకులు, నాబార్డు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్న ఎంపీ వేమిరెడ్డి
- ప్రభాకర్ రెడ్డి రుణమేళా నిర్వహణకు ఎంపీగా పూర్తి సహకారం అందిస్తా
- 2025-26లో 128 శాతంతో జిల్లా బ్యాంకర్ల బృందం పనితీరు అభినందనీయం
- ఈ ఏడాది టార్గెట్‌లో ఇప్పటికే మంచి ప్రగతి



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 18.**
నెల్లూరు జిల్లాలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాల సబ్సిడీలను మరింత దగ్గర చేసేందుకు మెగా రుణమేళా నిర్వహించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లా యంత్రాంగానికి సూచించారు. బ్యాంకులు, నాబార్డ్, ప్రభుత్వ శాఖలు కలిసి పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీ హిమాన్ను శుక్లా అధ్యక్షతన జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ ( డి ఎల్ ఆర్ సి ) సమావేశంలో ఎంపీ మాట్లాడారు.
పల్నాడు జిల్లా నరసరావుపేట తరహాలో నెల్లూరులో మెగా రుణమేళా
నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ ద్వారా 1.04 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల విలువైన రుణాలు, సబ్సిడీలు ఒకే రోజు అందజేశారని ఎంపీ గుర్తుచేశారు. అదే స్థాయిలో నెల్లూరు జిల్లాలో కూడా అర్హులైన ప్రజలకు గరిష్ఠంగా మేలు జరిగేలా ఒక కార్యక్రమానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ హిమాన్ను శుక్లా బ్యాంకర్లను కోరారు. అధికారులు, బ్యాంకర్లు చర్చించుకుని స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.
టార్గెట్‌ను మించి పనిచేస్తున్న జిల్లా బృందం
జిల్లాలో బ్యాంకింగ్ రంగం చూపిస్తున్న పురోగతిని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అభినందించారు. గతేడాది 128 శాతం పనితీరు కనబరిచారని, ఈ ఏడాది కూడా నిర్దేశించిన లక్ష్యాల కంటే ఎక్కువే సాధిస్తున్నారని కొనియాడారు. ఈ పనితీరు చూస్తుంటే రుణమేళాను కూడా అత్యంత విజయవంతంగా నిర్వహించగలరనే నమ్మకం ఉందన్నారు.
ఎంపీగా నా వంతు పూర్తి సహకారం
పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా ఉన్నందున ఈ రుణమేళా నిర్వహణకు కావాల్సిన ప్రయోజనాలను, అనుమతులను సాధించడంలో ఎంపీగా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా మన జిల్లా ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచే గొప్ప అవకాశంగా చూడాలని, మన తోటి సోదర సోదరీమణులకు మంచి చేస్తున్నామనే భావనతో ప్రతి అధికారీ పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు శ్రీ మొగిలి వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్.డి.ఎం) మణిశేఖర్, నాబార్డ్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ (డి.డి.ఎం) డాక్టర్ బాబు , 27 బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## శ్రీసిటీలో దొంగల హల్‌చల్‌కు చెక్.. చోరీ యత్నం భగ్నం

**శ్రీసిటీ, పెన్ పవర్ ఆగస్టు 18:**
శ్రీసిటీలో చోరీకి పాల్పడేందుకు దుండగులు చేసిన ప్రయత్నాన్ని భద్రతా సిబ్బంది, పోలీసులు సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఈ ఘటన ఆగస్టు 17న తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో కోల్మన్ కంపెనీ ప్రాంగణంలో చోటుచేసుకుంది.
కంపెనీ పరిసరాల్లో గస్తీ నిర్వహిస్తున్న శ్రీసిటీ భద్రతా సిబ్బందికి అనుమానాస్పద కదలికలు కనిపించడంతో వెంటనే అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న శ్రీసిటీ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రియాంక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని దుండగులను పట్టుకునేందుకు ప్రయత్నించారు.
పోలీసుల రాకను గమనించిన నిందితులు స్విఫ్ట్ డిజైర్ కారులో అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, శ్రీసిటీ గస్తీ బృందం కలిసి కారును వెంబడించారు.




కదూరు క్రాస్ సమీపంలో నిందితులు కారును వదిలేసి పరారయ్యారు. పోలీసులు కారును స్వాధీనం చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.
చోరీ యత్నంపై కేసు దర్యాప్తు కొనసాగుతోందని, నిందితులను గుర్తించి త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని శ్రీసిటీ డీఎస్పీ బి.వి. శ్రీనివాసులు తెలిపారు. చోరీ యత్నాన్ని సకాలంలో గుర్తించి అడ్డుకున్న శ్రీసిటీ భద్రతా సిబ్బంది, పోలీసు బృందాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.
పరిశ్రమలు, ఉద్యోగులు, ఆస్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీసిటీ భద్రతా బృందాలు పనిచేస్తున్నాయని సెక్యూరిటీ అధికారి వై. రమేష్ తెలిపారు. పోలీసు శాఖతో సమన్వయంతో నిరంతరం గస్తీ నిర్వహిస్తూ భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

## మున్సిపాలిటీ వారిగా ఫొటో, ఓటర్ల జాబితా ప్రచురణకు సన్నద్ధత ఉండాలి

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 18**
గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన మరియు ప్రచురణ కార్యక్రమం పూర్తి చేయాలి
జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా మందస్తు చర్యలు చేపట్టాలి
పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా
మునిసిపాలిటీ వారిగా వారీగా ఫొటో ఓటర్ల జాబితాల ప్రచురణకు అవసరమైన సన్నద్ధత చర్యలను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా ఆరు నియోజకవర్గ మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు.
మంగళవారం కలెక్టరేట్ లోనే కలెక్టర్ ఛాంబర్ నందు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ, త్రాగునీటి సరఫరా కొరకు చేపట్టవలసిన చర్యలు, పరిశుభ్రత పై జెడ్పి సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిని లలితా బాయి, ఆరు మున్సిపాలిటీల



మున్సిపల్ కమిషనర్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు అన్ని మున్సిపాలిటీలో వార్డుల వారీగా ఫోటో, ఓటర్ల జాబితాను సిద్ధం చేసి 03 సెప్టెంబర్ 26 వ తేదీన సంబంధిత కార్యాలయాల్లో ప్రచురించాలని ఆదేశించారు.
గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల పరిశీలన మరియు ప్రచురణ కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు కార్యక్రమం 18 ఆగస్టు 2026 నుండి ప్రారంభం అవుతుందని తెలిపారు.
జిల్లాలో అన్ని మున్సిపాలిటీలలో తాగునీటి సరఫరాపై మందస్తు చర్యలు తీసుకొని ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పగడ్బందీగా చేపట్టాలని స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు.

## హెచ్ఐవి/ఎయిడ్స్‌పై విద్యార్థులు, ప్రజలకు అవగాహన

**దొరవారిసత్రం, పెన్ పవర్ ఆగస్టు 18 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశా విభాగం సహకారంతో నవజీవన్ ఆర్గనైజేషన్‌సి.సి.పి.యు. ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌లో భాగంగా దొరవారిసత్రంలోని ఎం.జె.పి.బి.సి.డబ్ల్యు. జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజీ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాప్తి చెందే మార్గాలు, వ్యాధి వ్యాప్తి చెందని విధానాలు, లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితుల పట్ల వివక్ష చూపకుండా సమాజంలో కలిసిమెలిసి జీవించాల్సిన అవసరాన్ని వివరించారు.
అలాగే సుఖవ్యాధులు, చికిత్స విధానాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, కండోమ్ వినియోగం, హెచ్ఐవి/ఎయిడ్స్ చట్టం2017, ఏఆర్టీ మందులు, ఏపీ శాక్స్ యాప్, క్యూ.ఆర్. కోడ్, సెల్ఫ్ రిస్క్ అసెస్‌మెంట్, 1097 టోల్‌ఫ్రీ నంబర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తాము తెలుసుకున్న




విషయాలను ఇతరులకు కూడా తెలియజేసి హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన పెంచాలని విద్యార్థులకు సూచించారు.
కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం. తిరుపతయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఎం. సుజీవనరావు, లెక్చరర్ పి. కస్తూరి బాబు, ఓఆర్‌డబ్ల్యులు కె. విజయశ్రీ, ఆర్. భువనేశ్వరి, ఏఎన్‌ఎం జి. శ్రీలత, పీఈలు, 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.
అనంతరం క్రిష్ణాపురం ప్రాంతంలో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ర్యాలీలో సుమారు 100 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవజీవన్ సంస్థ ఏఎన్‌ఎం జి. శ్రీలత ఆధ్వర్యంలో 18 మందికి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించి, పరీక్షల ఫలితాలను వారికి తెలియజేశారు.

## దళిత వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి
### మూలం రమేష్




**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 18.**
సామాజిక శంఖారావం లో భాగంగా మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలో బైక్ ర్యాలీని జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు మూలం రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో దళితవాడలను, గిరిజన కాలనీలను ప్రజాసంఘాలు దళాలుగా ఏర్పడి పర్యటించారని తెలిపారు. వారి పర్యటనల్లో ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను సేకరించి వాటి పరిష్కారం కోసం ఈ నెల 24వ తారీఖున కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని తెలిపారు. ఈ ధర్నాకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న దళితులు, గిరిజనులు సమస్యలను వినతుల రూపంలో తీసుకొని వచ్చి ధర్నా జయప్రదం చేయాలని ఆయన కోరారు. దళితులకు, గిరిజనులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు, సాగుభూమి ఇవ్వాలని, సాగుభూమి ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రతి దళితవాడలో గిరిజన కాలనీలకు స్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, దారిలేని స్మశానాలకి దారులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటు సంస్థలలో దళితులకు, గిరిజనులకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం చట్టాన్ని కొనసాగించాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి 600 రూపాయలు కూలి ఇవ్వాలని, అదేవిధంగా పెండింగ్ బకాయిలు చెల్లించాలి అన్నారు. దళిత, గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం ఉచితంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం బైక్ ర్యాలీ ఇసుకపాళెం హరిజనవాడ, అరుంధతి వాడాలలో జెండా దిబ్బ, అన్నారెడ్డి పాళెం, మినగల్లు, జొన్నవాడ, పెనుబల్లి, బాపనపాడు, కాగులపాడు, ఆర్ఆర్ నగర్, దామరమడుగు, పల్లిపాళెం, గ్రామాల్లో దళితవాడలు, గిరిజన కాలనీలలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు మన్నూరు భాస్కరయ్య, గరికపాటి సురేష్, రైతు సంఘం నాయకులు గండవరపు శ్రీనివాసులు, పుత్తేటి మల్లికార్జున, సిఐటియు నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంబి రమణయ్య, మద్దిశెట్టి సురేష్, కౌలు రైతు సంఘం నాయకులు లక్ష్మయ్య, రమణయ్య, మాల్యాద్రి, చెన్నయ్య, సుబ్రమణ్యం, సిఐటియు నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, ఆవాజ్ నాయకులు షేక్ జానీ బాషా, ఖాదర్ బాషా, బాబు, మస్తాన్ , డివైఎఫ్ఐ నాయకులు సతీష్, ప్రజాసంఘాల నాయకులు సతీష్, అంకయ్య, నన్నం మాధవ, మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## కాంగ్రెస్‌లో చేరిన జనసేన మండల అధ్యక్షుడు ఆవుల రమణ



**సూళ్లూరుపేట, పెన్ పవర్ ఆగస్టు 18 :**
తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఆవుల రమణ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆవుల రమణకు ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జి.వి.వి.ఎస్. కమలాకరరావు, తిరుపతి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలగురువం బాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ దేశంలో 2029 సార్వత్రిక ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని వారు పేర్కొన్నారు. ఆవుల రమణ చేరికతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## నాగలాపురం ఈస్ట్ హ్యాబిటేషన్‌లో తాగునీటి కష్టాలు

**నాగలాపురం, పెన్ పవర్ ఆగస్టు 18 :**
తిరుపతి జిల్లా నాగలాపురం ఈస్ట్ హ్యాబిటేషన్‌లో తాగునీటి కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. గత నెల రోజులుగా తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం మహిళలు, చిన్నారులు బిందెలతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వారు తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని వాపోయారు. తాగునీటి కోసం ఇంతకాలం నిరీక్షించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈస్ట్ హ్యాబిటేషన్‌లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



## నంద్యాలలో 22న జిల్లాస్థాయి చెస్ పోటీలు



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్టు 18**
నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎన్ఆర్‌జీఎస్ అకాడమీ నిర్వహణలో ఈనెల 22న ఎన్జీవోస్ కాలనీలోని అచీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. 12 వయసు విభాగాల్లో పోటీలు నిర్వహించి, ఒక్కో విభాగంలో 10 చొప్పున మొత్తం 120 బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 21 సాయంత్రంలోపు ఏపీ చెస్ వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9010451585 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# గోరుకల్లు రిజర్వాయర్ వద్ద ఉద్రిక్తత..

## మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్న పోలీసులు



**పాణ్యం, పెన్ పవర్ ఆగస్టు 18 :**
నంద్యాల జిల్లా పాణ్యం మండలం గోరుకల్లు రిజర్వాయర్ వద్ద మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రిజర్వాయర్‌ను సందర్శించేందుకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పలువురు రైతులు రావడంతో పోలీసులు భారీగా మోహరించారు. రిజర్వాయర్ సందర్శనకు అనుమతి లేదంటూ పోలీసులు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని, రైతులను అడ్డుకున్నారు. రహదారికి అడ్డంగా తాళ్లు, పోలీసు వాహనాలను ఏర్పాటు చేసి వారిని ముందుకు వెళ్లకుండా పోలీసులు నిలువరించారు. దీంతో రిజర్వాయర్ పరిసరాల్లో కొంతసేపు హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఎంత నీటి నిల్వ ఉంది, దాని పూర్తి సామర్థ్యం ఎంత అనే వివరాలను అధికారులు స్వయంగా వచ్చి వివరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గోరుకల్లు రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్, ఎస్సార్బీసీ కాలువలకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆయన కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి విడుదలపై అధికారులు తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే రాకతో గోరుకల్లు రిజర్వాయర్ వద్ద పోలీసులు భారీగా మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# గ్రామాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన




**చేజర్ల, పెన్ పవర్ ఆగస్టు 18 :**
ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, నెల్లూరు జిల్లా దిశ ఆదేశాల మేరకు లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో చేజర్ల మండలంలోని పలు గ్రామాల్లో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు శశికళ అధ్యక్షతన ఏటూరు, నెర్నూరు, ఆదురుపల్లి, చిత్తలూరు, చేజర్ల, యనమదల, మడపల్లి గ్రామాల్లో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్ఐవి, లైంగిక వ్యాధులు (ఎస్టీఐ), టీబీ, హెపటైటిస్–బి వ్యాధుల లక్షణాలు, నివారణ చర్యలపై యువత, గ్రామస్తులకు వివరించారు. అలాగే హెచ్ఐవి సంబంధిత సందేహాలు, సమాచారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1097ను సంప్రదించాలని సూచించారు. హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన, హక్కులు, రక్షణకు సంబంధించిన హెచ్ఐవి అండ్ ఎయిడ్స్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్) యాక్ట్2017పై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మెహతాబ్, జోనల్ సూపర్‌వైజర్ ఎస్.కె. మున్ని, ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 2029లో భారత ప్రధానిగా రాహుల్ గాంధీనే :జివివిఎస్ కమలాకరరావు

## ఎన్డీఏ పాలనలో పేపర్ లీకులు, రామ మందిరం కుంభకోణాలు తప్ప అభివృద్ధి శూన్యం





**సూళ్లూరుపేట, పెన్ పవర్ ఆగస్టు 18 :**
2029లో రాహుల్ గాంధీ భారత ప్రధానమంత్రి కావడం ఖాయమని ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకరరావు అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో పేపర్ లీకులు, రామ మందిరానికి సంబంధించిన కుంభకోణాల ఆరోపణలు, అణగారిన వర్గాలపై అణచివేత తప్ప దేశంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేరుకున్న జివివిఎస్ కమలాకరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జివివిఎస్ కమలాకరరావు, జిల్లా అధ్యక్షుడు బాలగురువం బాబు మాట్లాడుతూ కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ ఆశించిన అభివృద్ధి కనిపించడం లేదని ఆరోపించారు. ఇరు ప్రభుత్వాల్లోని నాయకులు 'దోచుకోదాచుకో' విధానంతో పనిచేస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు తమ సమస్యలపై ఆందోళనకు దిగినట్లే, ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యార్థి లోకం భవిష్యత్తులో ప్రభుత్వాలపై తిరగబడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థుల ఆందోళనలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం కేంద్ర విద్యాశాఖ మంత్రితో రాజీనామా చేయించిందని ఆయన పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్య, సామాజిక న్యాయం, విద్యార్థులు, అణగారిన వర్గాల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 2027 తర్వాత కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుపై పరిశీలన

- యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి 72 వేల జనాభాతో పట్టణ స్వరూపం సంతరించుకున్న కోవూరు, పరిసర ప్రాంతాలు
- పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతానికి మున్సిపాలిటీ హోదాతో మరిన్ని నిధులు
- 2027 మార్చి 31 తర్వాత కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటును పరిశీలిస్తామన్న మంత్రి నారాయణ



**నెల్లూరు పెన్ పవర్ ఆగస్టు 18.**
కోవూరు పట్టణం, పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు. యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కోవూరు ప్రజలకు ఇచ్చిన మున్సిపాలిటీ హామీని నెరవేర్చాలని మంగళవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించామని, పట్టణ ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న కోవూరుకు మున్సిపాలిటీ హోదా లభిస్తే మౌలిక వసతులు మరింత మెరుగుపడటంతో పాటు ప్రత్యేక నిధులతో సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

### 72 వేల జనాభాతో పట్టణ స్వరూపం

కోవూరు నియోజకవర్గ కేంద్రంగా ఉన్న కోవూరు పంచాయతీ పరిధి ప్రస్తుతం సుమారు 4 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 45 వేల మంది జనాభా ఉన్న కోవూరు పూర్తిగా పట్టణ స్వరూపాన్ని సంతరించుకుందని చెప్పారు. కోవూరులో 4 హరిజనవాడలు, 5 గిరిజన కాలనీలు, 8 బీసీ కాలనీలు ఉన్నాయని, వీటికి మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కోవూరుతో పూర్తిగా కలిసిపోయిన పడుగుపాడు గ్రామం కూడా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, అక్కడ సుమారు 23 వేల మంది జనాభా ఉందన్నారు. కోవూరుకు సమీపంలోని పోతిరెడ్డిపాళెం గ్రామంలో సుమారు 4,300 మంది జనాభా ఉందని, అది కూడా కోవూరు పట్టణంలో కలిసిపోయినట్లుగా అభివృద్ధి చెందుతోందన్నారు. కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాళెం, పాటూరు ప్రాంతాలను కలిపితే సుమారు 72 వేల మంది జనాభాతో ఒక పెద్ద పట్టణ ప్రాంతంగా రూపుదిద్దుకుంటుందని వివరించారు.

### పంచాయతీ నిధులు సరిపోవడం లేదు

పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా ప్రస్తుతం పంచాయతీకి అందుతున్న నిధులు సరిపోవడం లేదని ప్రశాంతి రెడ్డి తెలిపారు. కాలనీల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు వంటి మౌలిక వసతులతో పాటు పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధికి కూడా భారీగా నిధులు అవసరమవుతున్నాయని చెప్పారు. మున్సిపాలిటీ హోదా లభిస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అందుబాటులోకి వచ్చే ప్రత్యేక నిధులను వినియోగించుకుని కోవూరు పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా కోవూరు ప్రజలు మున్సిపాలిటీ కోసం ప్రభుత్వాలను కోరుతున్నారని, ప్రజల ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

### పారిశ్రామిక అభివృద్ధికి అపార అవకాశాలు

కోవూరు ప్రాంతం నెల్లూరుబాంబే, నెల్లూరుకలకత్తా జాతీయ రహదారులకు ఆనుకుని వేగంగా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే తెలిపారు. సమీపంలో ఏపీఐఐసీ సెజ్, ఇఫ్కో కిసాన్ సెజ్, కృష్ణపట్నం పోర్టు వంటి కీలక పారిశ్రామిక ప్రాంతాలు ఉన్నాయని చెప్పారు. రైల్వే ఫీడర్ స్టేషన్ కూడా సమీపంలో ఉండటం వల్ల పారిశ్రామిక అభివృద్ధికి మరింత అనుకూల పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఇలాంటి భౌగోళిక, పారిశ్రామిక అనుకూలతలు ఉన్న కోవూరుకు మున్సిపాలిటీ హోదా కల్పిస్తే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పట్టణాన్ని అభివృద్ధి చేయవచ్చని అన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువనేత శ్రీ నారా లోకేష్ కోవూరు ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని మంత్రి ద్వారా కోరుతున్నానని ప్రశాంతి రెడ్డి తెలిపారు.

### 2027 మార్చి 31 తర్వాత పరిశీలిస్తాం: మంత్రి నారాయణ

కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుపై ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అడిగిన ప్రశ్నకు పురప, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సమాధానమిచ్చారు. జనాభా లెక్కల ప్రకారం 2027 మార్చి 31 వరకు భూభాగపు హద్దులు, అధికార పరిధులను మార్చవద్దని కేంద్ర ప్రభుత్వం సూచించిందని, అందువల్ల అప్పటి వరకు కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటు సాధ్యం కాదని తెలిపారు. ఆ గడువు అనంతరం కోవూరు మున్సిపాలిటీ ఏర్పాటుపై పరిశీలన చేయవచ్చని స్పష్టం చేశారు.

# నెల్లూరులో మెగా రుణమేళాకు కార్యాచరణ రూపొందించాలి





## బ్యాంకులు, నాబార్డు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి

## ఎంపీగా రుణమేళాకు పూర్తి సహకారం అందిస్తా: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

## 2025-26లో 128 శాతం పనితీరు అభినందనీయం

**నెల్లూరు, పెన్ పవర్ ఆగస్టు 18 :**
నెల్లూరు జిల్లాలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాల సబ్సిడీలను మరింత చేరువ చేసేందుకు మెగా రుణమేళా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. బ్యాంకులు, నాబార్డు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి రుణమేళాను విజయవంతం చేయాలని కోరారు.
మంగళవారం నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన జరిగిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో ఎంపీ మాట్లాడారు.

### నరసరావుపేట తరహాలో రుణమేళా

పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గంలో నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం ద్వారా ఒకేరోజు 1.04 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.3,216 కోట్ల విలువైన రుణాలు, సబ్సిడీలు అందించిన విషయాన్ని ఎంపీ గుర్తుచేశారు. అదే తరహాలో నెల్లూరు జిల్లాలోనూ అర్హులైన ప్రజలకు గరిష్ఠ ప్రయోజనం చేకూరేలా మెగా రుణమేళా నిర్వహించాలని సూచించారు.
ఈ మేరకు కలెక్టర్, బ్యాంకర్లు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పరం చర్చించి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు.

### బ్యాంకర్ల పనితీరుపై అభినందనలు

జిల్లాలో బ్యాంకింగ్ రంగం సాధిస్తున్న పురోగతిని ఎంపీ అభినందించారు. 202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లా బ్యాంకర్ల బృందం నిర్దేశిత లక్ష్యాల్లో 128 శాతం పనితీరు కనబరిచిందని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ లక్ష్యాల సాధనలో మంచి ప్రగతి సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పనితీరుతో మెగా రుణమేళాను కూడా విజయవంతంగా నిర్వహించగలరన్న విశ్వాసం ఉందన్నారు.

### ఎంపీగా పూర్తి సహకారం

పార్లమెంట్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా రుణమేళా నిర్వహణకు అవసరమైన సహకారం, అనుమతులు సాధించేందుకు తనవంతు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ బాధ్యతగా కాకుండా జిల్లా ప్రజలకు ఆర్థికంగా అండగా నిలిచే గొప్ప అవకాశంగా చూడాలని అధికారులను కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, బ్యాంకు రుణాలు అందేలా అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



సమావేశంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డు డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్ డాక్టర్ బాబు, 27 బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధ్వానంగా విద్యానగర్ - నాయుడుపేట రహదారులు

– గతుకులమయంగా ప్రధాన మార్గాలు.. చినుకు పడితే చెరువులే
ప్రమాదాలతో బిక్కుబిక్కుమంటున్న వాహనదారులు, ప్రయాణికులు
నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోని కోటనాయుడుపేట రహదారి
డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి







**కోట, పెన్ పవర్ ఆగస్టు 18 :**
కోట మండలంలోని విద్యానగర్ నుంచి నాయుడుపేటకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ చూసినా భారీ గోతులు, గతుకులతో రహదారులు ప్రమాదకరంగా మారాయి. వర్షం కురిస్తే గోతుల్లో నీరు నిలిచి రహదారి పరిస్థితి మరింత దయనీయంగా తయారవుతోంది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హడలెత్తిస్తున్న కోట-విద్యానగర్-నాయుడుపేట మార్గాలు

కోట నుంచి క్రాస్‌రోడ్డు, విద్యానగర్, నాయుడుపేట వైపు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని వాహనదారులు చెబుతున్నారు. విద్యానగర్ నుంచి మెట్టు మార్గం కూడా అధ్వానంగా మారడంతో విద్యానగర్, గూడలి, మెట్టు తదితర ప్రాంతాలతో పాటు సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకల్లో ఇబ్బందులు పడుతున్నారు. కోటనాయుడుపేట ప్రధాన రహదారి కూడా చాలా కాలంగా మరమ్మతులకు నోచుకోలేదని స్థానికులు పేర్కొంటున్నారు.
ఈ మార్గంలో గ్రావెల్ లారీలు నిత్యం రాకపోకలు సాగించడం, భారీ వర్షాల కారణంగా రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకోవడానికి కూడా అవకాశం లేకపోవడంతో ప్రమాద భయం నెలకొంది.

### విద్యానగర్ - గునపాడు రహదారి దుస్థితి

విద్యానగర్ నుంచి గునపాడు, నాయుడుపేట వైపు వెళ్లే రహదారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. అడుగడుగునా గోతులు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఎన్‌బీకేఆర్ కళాశాల విద్యార్థులతో పాటు గూడలి, రాజుపాలెం, కాశీపురం, జంద్రాపేట, ఈశ్వరవాక, కొండాపురం, మెట్టు, చిట్టమూరు, వాకాడు మండలాలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.
రహదారి పరిస్థితి అధ్వానంగా మారడంతో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి దారితీసే పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఎన్‌బీకేఆర్ కళాశాల జంక్షన్ చెరువును తలపిస్తోంది

విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాల జంక్షన్ వద్ద రహదారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వర్షం కురిసిన ప్రతిసారీ కూడలిలో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. గోతులు నీటితో నిండిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.
విద్యార్థులు, అధ్యాపకులు, ప్రయాణికులు, పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ఈ మార్గాన్ని వినియోగిస్తున్న నేపథ్యంలో అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

### పల్లె రోడ్లపై పవన్ కళ్యాణ్ దృష్టి పెట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో కోటనాయుడుపేట మార్గానికి అనుసంధానంగా ఉన్న మారుమూల గ్రామాల రహదారులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.
గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న ఈ ప్రాంతాల్లో రహదారి సౌకర్యం మెరుగుపడితే అనేక గ్రామాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొంటున్నారు. వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగించే ఎన్‌బీకేఆర్ కళాశాల పరిసర రహదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.
ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి గోతులను పూడ్చడంతో పాటు, అవసరమైన చోట్ల రహదారులను పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని పల్లె రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

# ఆరు రోజుల్లో భారీ మొబైల్ షోరూమ్ చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**రూ.1.50 కోట్ల విలువైన 195 మొబైల్ ఫోన్లు, 5 యాపిల్ ట్యాబ్‌లు స్వాధీనం**

**బంగ్లాదేశ్‌కు చోరీ సొత్తు తరలించే అంతర్రాష్ట్ర ముఠా గుట్టురట్టు**

**ఐదుగురు నిందితుల అరెస్ట్.. దర్యాప్తు బృందాలకు ఎస్పీ అభినందనలు**









**క్రైమ్ బ్యూరో పెన్ పవర్ తిరుపతి, ఆగస్టు 18:**
తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనోవిజన్ మొబైల్ షోరూమ్‌లో సినీఫక్కీలో జరిగిన భారీ చోరీ కేసును తిరుపతి జిల్లా పోలీసులు కేవలం ఆరు రోజుల్లోనే ఛేదించారు. సుమారు రూ.1.50 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను చోరీ చేసి బంగ్లాదేశ్‌కు తరలించేందుకు ప్రయత్నించిన అంతర్రాష్ట్ర ముఠాకు చెందిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి మొత్తం 195 మొబైల్ ఫోన్లు, ఐదు యాపిల్ ట్యాబ్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఆగస్టు 8న తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు షోరూమ్ గోడకు రంధ్రం చేసి లోపలికి ప్రవేశించి భారీగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను అపహరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.

జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ప్రత్యక్ష పర్యవేక్షణలో, తిరుపతి అదనపు ఎస్పీ అడ్మిన్ (క్రైమ్ ఇన్‌చార్జి) ఆర్ల శ్రీనివాసులు, తిరుమల అదనపు ఎస్పీ ఐ. రామకృష్ణ, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. నేర పరిశోధన విభాగం, ఆధారాల సేకరణ బృందం, సైబర్ నేర విభాగం, కమాండ్ కంట్రోల్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

### జార్ఖండ్ నుంచి పశ్చిమ బెంగాల్ వరకు దర్యాప్తు

నేరం జరిగిన తీరును విశ్లేషించిన పోలీసులు దేశంలోని పెద్ద మొబైల్ షోరూమ్‌లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలపై దృష్టి సారించారు. జార్ఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలకు చెందిన ముఠాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి సమాచారాన్ని సేకరించారు. అనంతరం ప్రత్యేక పోలీసు బృందాలను జార్ఖండ్, నాగ్‌పూర్, పశ్చిమ బెంగాల్‌కు తరలించారు.

ఇతర రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు చేపట్టిన బృందాలు, చోరీ సొత్తుతో నిందితులు బంగ్లాదేశ్ సరిహద్దు వైపు వెళ్తున్నట్లు గుర్తించారు. దీంతో పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా సమీపంలో వలపన్ని ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు చోరీ సొత్తును స్వీకరించే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

వారి నుంచి సోనోవిజన్ షోరూమ్‌లో చోరీకి గురైన 175 మొబైల్ ఫోన్లు, ఐదు యాపిల్ ట్యాబ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి, రవాణా వారెంట్ ద్వారా తిరుపతికి తీసుకొచ్చారు.

### తిరుపతిలో మరో నిందితుడి అరెస్ట్

నిందితుల విచారణలో లభించిన సమాచారంతో టోనిక్ షేక్ సోదరుడు అనికుల్ షేక్‌ను మంగళవారం ఉదయం తిరుపతిరేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి ఆసుపత్రి సమీపంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి మరో 20 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఈ కేసులో స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్ల సంఖ్య 195కు చేరింది.

### పలు రాష్ట్రాల్లో నేర చరిత్ర

దర్యాప్తులో నిందితులు జార్ఖండ్ రాష్ట్రంలోని సాహెబ్‌గంజ్ జిల్లాకు చెందిన వారని, ముఠాగా ఏర్పడి పెద్ద మొబైల్ దుకాణాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా పరిసర ప్రాంతాలకు తరలించి, అక్కడి నుంచి బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు తరలిస్తున్నట్లు వెల్లడైంది.

ప్రధాన నిందితుడు ఆలమ్ షేక్‌పై జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 12 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లో అతనిపై గ్యాంగ్‌స్టర్స్ మరియు సంఘవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదై, సుమారు రెండేళ్లు జైలులో ఉన్నట్లు వెల్లడైంది.

### వ్యాపార సంస్థలకు ఎస్పీ సూచనలు

భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తిరుపతి నగరంలోని నగల దుకాణాలు, పెద్ద వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, ఇతర దుకాణాల యజమానులు అధునాతన భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు సూచించారు. ముఖ్యంగా కదలికలను గుర్తించే కెమెరాలు, హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అవసరమైన చోట ప్రైవేటు భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు.

### దర్యాప్తు బృందాలకు ఎస్పీ అభినందనలు

కేసును అత్యంత స్వల్ప వ్యవధిలో ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, తిరుమల అదనపు ఎస్పీ ఐ. రామకృష్ణ పర్యవేక్షణలో పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు శివకుమార్‌రెడ్డి, అబ్బన్న, ఎస్‌ఐలు నాగార్జునరెడ్డి, సుబ్బారెడ్డి, చిరంజీవి, సిబ్బంది మోహన్‌కుమార్, చంద్రశేఖర్, గౌస్ ఆరిఫ్, మునిరాజు, గోపికృష్ణ, మురళిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

### అరెస్టయిన నిందితుల వివరాలు

1. ఆలమ్ షేక్ (49) సాహెబ్‌గంజ్ జిల్లా, జార్ఖండ్.
2. ఎం.డి. బసీరుద్దీన్ షేక్ (66) సాహెబ్‌గంజ్ జిల్లా, జార్ఖండ్.
3. టోనిక్ షేక్ (32) సాహెబ్‌గంజ్ జిల్లా, జార్ఖండ్.
4. ఎం.డి. అష్మోల్ హక్ అలియాస్ సోహెల్ (34) ముర్షిదాబాద్, పశ్చిమ బెంగాల్. చోరీ సొత్తును స్వీకరించే వ్యక్తి.
5. అనికుల్ షేక్ (సుమారు 26) సాహెబ్‌గంజ్ జిల్లా, జార్ఖండ్.

# సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగస్టు 18**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశం అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సూళ్లూరుపేట నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి కాళంగి బ్రిడ్జి,కొరిడి-పెర్నాడు రోడ్డు, వేనాడు రోడ్డు తదితర కీలక అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ చర్చించారు. ఈ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేసి త్వరగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోరారు.

# ఘనంగా కాత్యాయని వ్రతం ప్రత్యేక పూజలు



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 18.**
శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఘనంగా కాత్యాయని వ్రతంభక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు విశేషంగా పాల్గొన్న మహిళా భక్తులు జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో మంగళవారం కాత్యాయని వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా వ్రత కార్యక్రమాలను నిర్వహించి, కాత్యాయని అమ్మవారికి విశేష పూజలు మరియు ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. కాత్యాయని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగడంతో పాటు కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో వ్రత కార్యక్రమానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారికి కుంకుమ సమర్పించి, మంగళహారతిలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా కాత్యాయని వ్రతాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, పూజా కార్యక్రమాలు, తీర్థప్రసాదాల పంపిణీ తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుపతిని 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్'గా

# తీర్చిదిద్దే బృహత్ ప్రణాళిక




- రూ.800 కోట్లతో 34 చెరువుల అనుసంధానం, సుందరీకరణ
- వరద ముప్పు నివారణతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- క్షేత్రస్థాయిలో ప్రణాళికకు రూపకల్పన చేస్తున్న తుడా

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 18:**
తిరుపతి నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్' గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్‌అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా ఈ ప్రాజెక్టుపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు, అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఐసీఎల్ఈఐ, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు గత రెండు రోజులుగా తిరుపతిలోని పలు చెరువులు, నీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్, తుడా వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు.

### 34 చెరువుల అనుసంధానం

తిరుపతి నగరంలో ప్రస్తుతం ఉన్న చెరువులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేసి అభివృద్ధి చేయనున్నట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు. రాబోయే ఐదు నుంచి పదేళ్లలో నగర విస్తరణ, భవిష్యత్‌లో ఏర్పడే గ్రేటర్ తిరుపతి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 34 చెరువులను అనుసంధానం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నగరంలో వరద ముంపును నివారించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తిరుపతి ప్రాంతాన్ని ఐదు జోన్లుగా




విభజించి దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

### మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా చర్యలు

ఇళ్ల నుంచి వచ్చే మురుగు, మురుగునీరు చెరువుల్లో కలవకుండా ప్రత్యేక మురుగునీటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే చెరువుల్లోకి చేరేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందుకు అంతర్జాతీయ సంస్థ ఐసీఎల్ఈఐ సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

### పేరూరు నుంచి అవిలాల వరకు తొలి విడత పనులు

ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో పేరూరు చెరువు నుంచి అవిలాల చెరువు వరకు 5.6 కిలోమీటర్ల కాలువ అభివృద్ధి పనులకు రూ.7 కోట్లు, అవిలాల చెరువు అభివృద్ధి, కట్ట పనులకు రూ.23 కోట్లతో టెండర్లు ఇప్పటికే పిలిచినట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు.



చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని బ్యాంకు రుణాల తిరిగి చెల్లింపులు, భవిష్యత్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు.

### కపిలతీర్థం నీటితో తాగునీటి సరఫరా

కపిలతీర్థం నుంచి వృథాగా ప్రవహించే నీటిని అటవీ ప్రాంతంలో ప్రత్యేక కుంట నిర్మించి నిల్వ చేయడంతో పాటు, గురుత్వాకర్షణ శక్తి ఆధారంగా సుమారు 30 వేల నుంచి 40 వేల మందికి తాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

మాల్వాడిగుండం ప్రాంతంలో సుమారు 200 అడుగుల వెడల్పు, 300 నుంచి 400 మీటర్ల విస్తీర్ణంలో భారీ ఇంకుడు గుంత తరహా నిర్మాణాన్ని చేపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేయనున్నట్లు చెప్పారు. మల్లెమడుగు డ్యామ్ నీటిని కూడా సద్వినియోగం చేసుకుని మంగళం పంప్‌హౌస్ ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### అనంతసాగరం చెరువు టూరిజం హబ్‌గా అభివృద్ధి

శెట్టిపల్లె, తుడా లేఅవుట్లు, పరిసర ప్రాంతాల్లో భవిష్యత్‌లో సుమారు 15 వేల మందితో కొత్త నగర ప్రాంతం అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో అనంతసాగరం చెరువును భారీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతోందని, నెలాఖరులోగా టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

60 అడుగులు, 80 అడుగులు, 100 అడుగుల రహదారులతో అనుసంధానం కల్పిస్తూ అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

### వరదలు, నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

వర్షాకాలంలో వరదలు, వేసవిలో నీటి ఎద్దడి అనే సమస్యలు తిరుపతి నగరంలో శాశ్వతంగా లేకుండా చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని డా. దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. నగర ప్రజలతో పాటు ప్రతిరోజూ తిరుపతికి వచ్చే సుమారు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తిరుపతి నగరం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చెరువుల నిర్వహణ, వరద నియంత్రణ, నీటి సంరక్షణలో రోల్ మోడల్‌గా, కేస్ స్టడీగా నిలిచే అవకాశం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో జర్మనీ కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు, ఐసీఎల్ఈఐ, ఏపీయూఐఏఎంఎల్ సంస్థల ప్రతినిధులతో పాటు తుడా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, తిరుపతి మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జక్కంచెర్లకు

## ఉచిత మార్చురీ బాక్స్ వితరణ

### - వెన్నా శ్రీనివాస్ తల్లితండ్రుల జ్ఞాపకార్థం



**గూడూరు, పెన్ పవర్ ఆగస్టు 18:**
పెడన నియోజకవర్గం గూడూరు మండలం జక్కంచెర్ల గ్రామంలో అభినందనీయ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, రాధారంగ మిత్రమండలి సభ్యుడు వెన్న శ్రీనివాస్ తన తల్లిదండ్రులు వెన్నా రామకృష్ణ, నాంచారమ్మ జ్ఞాపకార్థం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఉచితంగా మార్చురీ బాక్స్‌ను అందజేశారు.కార్యక్రమానికి రాధారంగ మిత్రమండలి రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సేవా దృక్పథంతో మార్చురీ బాక్స్‌ను అందించడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్‌ను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు.సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్న వెన్న శ్రీనివాస్‌ను రాధారంగ మిత్రమండలి జిల్లా కమిటీలోకి నియమిస్తున్నట్లు బుల్లెట్ ధర్మారావు ప్రకటించారు. ఇప్పటివరకు మచిలీపట్నం మెంబర్‌గా కొనసాగుతున్న ఆయనకు జిల్లా కమిటీలో బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన మార్చురీ బాక్స్‌ను అందించిన శ్రీనివాస్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. రాఘవమ్మతో పాటు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వెన్నా సుబ్రమణ్యం, ఎర్రపోతు బంగారం, వన్నెం రెడ్డి ప్రసాద్, సనక శ్రీనివాస్, మత్తే ప్రసాద్, తాలారీ నాగమల్లేశ్వరరావు, మత్తి పూర్ణచంద్రరావు, ఎల్ఐసీ రాంబాబు, ఆత్మూరి భీమరాజు, వెన్నా శ్రీనివాసరావు, తోట కోదండం తదితరులు పాల్గొన్నార

## ప్రథమ చికిత్సకు వచ్చిన రోగులను

# పట్టించుకోని సిబ్బంది?

**నాగలాపురం, పెన్ పవర్, ఆగస్టు 18:**
నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స కోసం వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరుకునే రోగులు, వారి కుటుంబ సభ్యులు సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సిన నర్సులు, డ్యూటీ అధికారులు రోగుల పరిస్థితిని స్వయంగా పరిశీలించి అవసరమైన ప్రథమ చికిత్స అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్నిసార్లు రోగులను పట్టించుకోకుండా అక్కడ పనిచేస్తున్న అటెండర్ల ద్వారా ప్రథమ చికిత్స చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అత్యవసర సమయంలో వైద్య సహాయం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది.చిన్నపాటి గాయాలు, ప్రమాదాలు, జ్వరం, ఇతర అత్యవసర సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాల్సి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సేవలు ఆశించిన స్థాయిలో అందకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది విధులకు హాజరు, రోగులకు అందుతున్న ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోగులకు




ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## దేవస్థానం అభివృద్ధికి 6 లక్షలు ఆర్థిక సహాయం చేసిన గోళ్ళ రాజేష్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్ట్ 18**
నంద్యాల పట్టణంలోని శ్రీ కేదారేశ్వరీ సమేత శ్రీ స్థానిక ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానము నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా దేవస్థాన చైర్మన్ చలం బాబు ఆహ్వానం మేరకు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్ దేవస్థానంకు విచ్చేశారు. ఈ సందర్భంగా గోళ్ల రాజేష్ కు దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు మంగళ వాయిద్యాలతో సాథర స్వాగతం పలికారు.దేవస్థానముకు విచ్చేసిన గోళ్ళ రాజేష్ తో దేవస్థాన చైర్మన్ దేవస్థానం చలం బాబు దేవస్థానం నందు నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు నూతన నిర్మాణాలు,కేదారేశ్వరి దేవి అన్నదాన సత్రాలు భక్తుల వసతి గృహ గురించి సవివరంగా గోళ్ళ రాజేష్ కు వివరించారు. దేవస్థానము నందు కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను చూసిన అనంతరం గోళ్ళ రాజేష్ ఆనందం వ్యక్తం చేశారు. అందులో భాగంగా తన వంతు సహాయంగా దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకొనేందుకు దేవస్థాన నిర్మాణ అభివృద్ధి కార్యక్రమాలకు ఆరు లక్షల విరాళాలం చెక్కును శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చలం బాబుకు, దేవస్థాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అందించారు. భవిష్యత్తులో దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఆర్థిక సాయం చేసేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్టు గోళ్ళ రాజేష్ తెలియజేశారు.పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ముందుగా దేవ గణాధిపతి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం శ్రీ కేదారేశ్వరి సమేత శ్రీ ప్రథమనందీశ్వర స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ చలం బాబు గోళ్ళ రాజేష్ కు శాలువాలు, పులదండలతో కూడా తో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## ప్రజా సేవలోనే నా రాజకీయ ప్రయాణం

### " మాజీ ఎన్ డి సి సి బి చైర్మన్ కామిరెడ్డి"



**పెళ్లకూరు, పెన్ పవర్, ఆగష్టు 18**
ప్రజా సేవకునిగా కడవరి వరకు వైకాపా పార్టీలోనే ఉంటూ ప్రజల శ్రేయస్సు కోసం నా రాజకీయ ప్రయాణం సాగుతుందని మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం పెళ్లకూరు మండల పరిధిలోని రావులపాడు గ్రామంలో " గుడ్ మార్నింగ్ " కార్యక్రమాన్ని తిరిగి తల పెట్టారు. ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సాదర స్వాగతం పలికారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలతో పాటు, గ్రామ సమస్యలను తెలుసుకుంటూ కార్యక్రమాన్ని కొనసాగించారు. గత ప్రభుత్వంలో జగనన్న పాలనలో ప్రజలకు అందిన ఆర్థికపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులతో కలసి చర్చించుకున్నారు. మళ్లీ అభివృద్ధి కావాలన్నా, తిరిగి మన రాష్ట్ర ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మీ సమస్యలు నా దృష్టికి తెస్తే, నా సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో మన పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించుకునేందుకు కలసికట్టుగా పార్టీ అభిమానులుగా పని చేయాలని కోరారు.



2029లో జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ప్రతి నాయకుడు, కార్యకర్తలు చురుగ్గా పార్టీలో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రిస్కిల్లా, గెంజి. మాతయ్య, గెంజి.మస్తానయ్య , శ్రీపురం. ముని రాజా,అక్కుపల్లి. వెంకటేష్,గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారిపై హింస.. గంటల్లోనే నిందితుల అరెస్ట్



**ఆత్మకూరు, పెన్ పవర్, ఆగష్టు 18:**
నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు గ్రామంలో తొమ్మిదేళ్ల చిన్నారిపై జరిగిన అమానుష ఘటనపై ఆత్మకూరు పోలీసులు వేగంగా స్పందించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు.. ఘటనకు బాధ్యులైన ఇద్దరు ప్రధాన నిందితులను గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. అంగడిలో దొంగతనం చేసిందనే అనుమానంతో తొమ్మిదేళ్ల బాలికను అక్రమంగా నిర్బంధించి, తాడుతో కట్టేసి హింసించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలి తల్లి కడమంచి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో ఆత్మకూరు అర్బన్ సీఐ, ఎస్ఐలు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు.కేసు తీవ్రతను గుర్తించిన పోలీసులు నిందితులు పరారయ్యేలోపే పక్కా సమాచారంతో గాలింపు చేపట్టారు. కురుకుంద రోడ్డులోని ఇటుకల బట్టీ సమీపంలో దాక్కున్న ప్రధాన నిందితులు రాజు నాయక్ (ఏ1), మల్లు నాయక్ (ఏ2)లను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.బాధితురాలు మైనర్ బాలిక కావడం, ఆమె గుర్తింపు బహిర్గతమయ్యేలా వీడియో చిత్రీకరించిన అంశాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు జువైనల్ జస్టిస్ చట్టం కింద కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్



చేయడంపై స్థానికులు, ప్రజలు ఆత్మకూరు పోలీసుల చర్యలను అభినందిస్తున్నారు. ఇదిలా ఉండగా, బాధితురాలు మైనర్ కావడంతో ఆమె ఫొటోలు, వీడియోలు, గుర్తింపును వెల్లడించే వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

### భట్టిప్రోలు తహసిల్దార్ ను సత్కరించిన

# సచివాలయ సిబ్బంది.



**భట్టిప్రోలు, పెన్ పవర్ (ఆగస్టు,18)**
80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న భట్టిప్రోలు తహసిల్దార్ జి నాగరాజును మంగళవారం భట్టిప్రోలు సచివాలయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు సచివాలయం నుండి డిజిటల్ అసిస్టెంట్ జి. రవితేజ, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.సురేష్, తదితరులు పాల్గొని తహసిల్దార్ నాగరాజుకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అనంతరం దుశ్శాలువతో సత్కరించారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి నాగరాజు లాగాగౌరవం దక్కుతుందని సచివాలయ సిబ్బంది వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో నాగరాజు మరెన్నో పురస్కారాలు అందుకోవాలని మరింత ఉన్నత స్థాయిని అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజుతో పాటు సచివాలయం సిబ్బంది మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

## ను కలిసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ...



**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగష్టు 18**
రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలు అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రి నిమ్మల రామానాయుడు తో సూళ్లూరుపేట నియోజకవర్గంలో సాగునీటి అభివృద్ధి పనులకు కావలసిన నిధుల విషయమై చర్చించారు.నియోజకవర్గంలోని మీజూరు చెక్ డామ్,వాటంబేడు గ్రాయిన్,చెంబేడు రిజర్వాయర్ నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు.ం

## నాయుడుపేటలో క్షుద్ర పూజల కలకలం...

## భయాందోళనలో బీడీ కాలనీ ప్రజలు...



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగష్టు 18**
నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలో గల స్వర్ణముఖి నదిలో నలుగురు వ్యక్తులు సోమవారం రాత్రి క్షుద్ర పూజలు చేయడం కలకలం సృష్టించింది.నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలోని స్వర్ణముఖి నదిలో క్షుద్ర పూజలు చేస్తుండడాన్ని స్థానిక యువకులు గుర్తించి, పట్టణంలోని అగ్రహారపేటకు చెందిన ఒక వ్యక్తిని చెన్నై కి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు.నదిలో భారీ రాక్షస బొమ్మ, ముగ్గులు వేసి క్షుద్ర పూజలు చేస్తుండడంతో స్థానికులకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. క్షుద్ర పూజలు చేస్తున్న నలుగురు వ్యక్తులు నదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## జడ పోలయ్య కుటుంబానికి

## ఆర్థిక సాయం వేంకటాద్రి నాయుడు



**కొండాపురం పెన్ పవర్ ఆగస్టు 18.**
కొండాపురం మండలందప్రతి గ్రామం అభివృద్ధి చెందడమే తెదేపా లక్ష్యం చెరుకూరి వెంకటాద్రి నాయుడుకొండాపురం మండల పార్టీ మాజీ అధ్యక్షులు,కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో 210,211 బూత్ పరిధిలో భూత్ ఇంచార్జ్ లు చెరుకూరి శేషయ్య, బండ్లమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ మాజీ అధ్యక్షులు చెరుకూరి వెంకటాద్రినాయుడు అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలు జడ పోలయ్య, జడ దిలీప్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు

## జగన్‌తో మహేంద్రుడి ఆత్మీయ భేటీ

### సత్యవేడు రాజకీయ పరిణామాలపై మాజీ సీఎం జగన్ ఆరా



**సత్యవేడు, పెన్ పవర్, ఆగష్టు 18:**
తిరుపతి జిల్లా వరదయ్యపాలెం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్రుడు మంగళవారం తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేంద్రుడిని జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ “ఏం మహీ.. బాగున్నావా?” అని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం సత్యవేడు నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పరిస్థితిపై జగన్ ఆరా తీసినట్లు తెలిసింది.అలాగే బీసీ సెల్ అధ్యక్షుడిగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మహేంద్రుడు చేస్తున్న కృషి, చేపడుతున్న కార్యక్రమాల వివరాలను కూడా జగన్ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆప్యాయంగా పలకరించి, నియోజకవర్గ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకోవడం ఈ భేటీకి ప్రత్యేకతగా నిలిచింది.